

వేతన వెతలు..!

ప్రభుత్వ బడుల్లో ఆయాలు, వాచ్‌మెన్‌కు అందని జీతాలు

కుటుంబం గడవక అవస్థలు.. పట్టించుకోని పాలకులు, అధికారులు



పాఠశాలను శుభ్రం చేస్తున్న ఆయా



ధర్మవరం, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్ వేతన వెతలు పడుతున్నారు. ఐదు నెలలుగా జీతాలు అందక అల్లాడిపోతున్నారు. పూట గడవక అవస్థలు పడుతున్నారు. పొట్టకూటి కోసం పాఠశాలల్లో పారిశుధ్య పనులకు చేరిన చిరుద్యోగులు వేతనాలు అందక విలవిల్లాడుతున్నారు. జిల్లాలో 2492 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 2,134 మంది ఆయాలు, 236 మంది వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. వారికి ప్రతినెల రూ.6 వేలు చొప్పున వేతనాలు అందిస్తారు. జీతం సొమ్ము అందితేనే ఇల్లు గడిచే పరిస్థితి వారిది. అలాంటి వారికి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు పెండింగ్‌లో పెట్టారు. దాదాపు రూ.5 కోట్లు బకాయి ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయాలు, వాచ్‌మెన్ దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

అప్పులు చేసి కుటుంబ పోషణ

ఆయాలు, వాచ్‌మెన్‌కు అందే తక్కువ జీతంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు. లేదంటే తిప్పలు పడాల్సిందే. అలాంటి వారికి జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన చెందుతున్నారు. వేతన బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయాలు, వాచ్‌మెన్ వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జీతాలు అందించాలని వారు కోరుతున్నారు.

జీవనం.. దుర్భరం



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఐదు నెలలుగా జీతాలు అందలేదు. దీంతో వారి కుటుంబ జీవనం దుర్భరంగా మారింది. వారికి ఇచ్చేది అరకొర జీతనం అది కూడా సకాలంలో చెల్లించకపోతే కుటుంబపోషణ ఎలా చేసుకుంటారు? వారు జీతాల విషయమై ప్రధానోపాధ్యాయులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆయాలు, వాచ్‌మెన్‌కు వేతన బకాయిలు చెల్లించాలి.

- జేవీ రమణ, సీఐటీయూ మండల కన్వీనర్

బడ్జెట్ రాగానే జీతాలు చెల్లిస్తాం

ప్రభుత్వం నుంచి విద్యాశాఖకు బడ్జెట్ శాఖల వారీగా వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌కు బడ్జెట్ రాగానే వేతనాలు చెల్లిస్తాం. ఇదివరకే ఆయా, వాచ్‌మెన్ వేతనాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

-నాగరాజు, విద్యాశాఖ ఏడీ

కుర్చీ కోసం కొట్లాట..!

కదిరి, ఆగస్టు 29: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో కుర్చీల కోసం గురువారం కొట్లాడుకున్నారు. విద్యార్థులు అనుకుంటే పొరబడినట్లే. ఉపాధ్యాయులే వాదనకు దిగారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలంతో టీచర్లు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. పాఠశాలలో 40మందికిపైగా టీచర్లు పనిచేస్తున్నారు. ఐదుకుపైగా సిబ్బంది గదులున్నాయి. వాటిలో కుర్చీలు లేవంటూ ప్రధానోపాధ్యాయుడితో కొంతమంది టీచర్లు వాదనకు దిగినట్లు తెలుస్తోంది. అదే పాఠశాలలో మరికొంత మంది టీచర్లు.. వారి గదుల్లో రెండు, మూడు కుర్చీలు కూర్చోవడానికి, కాళ్లు పెట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నట్లు టీచర్లు మండిపడ్డారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తరగతి గదుల్లో కూడా కుర్చీలు లేకపోతే కింద కూర్చుని పాఠాలు చెప్పాలా అని ప్రశ్నించినట్లు సమాచారం. ఇంత పెద్ద పాఠశాలలో కుర్చీలు లేకపోవడం ఏమటని పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) సమావేశానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై హెచ్‌ఎంను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



కదిరి బాలికోన్నత పాఠశాల

మాతృభాషతోనే మనుగడ: కలెక్టర్

పుట్టపర్తి, ఆగస్టు 29: మాతృభాషతోనే మానవ జాతి మనుగడ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. తెలుగుభాషను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో తెలుగు అధికార భాషాదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగుభాష కమ్మదనాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. తెలుగును ప్రేమిస్తే అమ్మను గౌరవించినట్లేనన్నారు. గ్రాంధిక భాషకు పట్టం కడుతున్న రోజుల్లో వ్యవహారిక భాషను కాపాడుకోవడానికి గిడుగు రామ్మూర్తి పంతులు పోరాటం చేశారన్నారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో భాగ్యరేఖ పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థినులు



నియోజకవర్గానికి నీరివ్వండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే కందికుంట వినతి

కదిరి, ఆగస్టు 29: నియోజకవర్గంలో హంద్రీనీవా ప్రధాన కాలువకు నీరివ్వాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విన్నవించారు. విజయవాడలో ముఖ్యమంత్రిని గురువారం కలిసినట్లు ఎమ్మెల్యే ఫోన్‌ద్వారా తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. హంద్రీనీవాకు నీరు వదిలితే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ తలుపుల, నంబులపూలకుంట, కదిరి మీదుగా వెళ్తోందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు కాలువ పనులు 95 శాతం పూర్తి చేశారన్నారు. మిగిలిన 5శాతం పనులు పూర్తిచేస్తే మూడు మండలాలకు తాగు, సాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు రూ.160కోట్లు అవసరమని హంద్రీనీవా అధికారులు అంచనా వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కదిరి, నల్లచెరువు, తనకల్లు మండలాలకు నీరు అందుతోందన్నారు. తనకల్లు నుంచి గాండ్లపెంట మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా హంద్రీనీవా నీరు తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. వెంటనే నిధులిచ్చి, పనులు చేపట్టాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే కందికుంట తెలిపారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కందికుంట

పెనుకొండ అభివృద్ధికి సహకరించండి

మంత్రి నారాయణకు సవిత వినతి

పెనుకొండ టౌన్, ఆగస్టు 29: నిధులు ఇచ్చి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత కోరారు. విజయవాడలోని మంత్రి నారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. పెనుకొండలో నిలిచిపోయిన తాగునీటి పథకం పనులు చేపట్టాలనీ, నగర పంచాయతీలో సిబ్బందిని పెంచాలని కోరారు. నిత్యం పెనుకొండకు ఇతర ప్రాంతాల నుంచి కార్మికులు వస్తున్నారనీ, తద్వారా జనాభా పెరుగుతోందని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమృత 2.0 పథకం కింద తాగునీటి వసతి కల్పనకు పెనుకొండను ఎంపిక చేయాలన్నారు. 18కి.మీ. దూరంలో ఉన్న గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించాలని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. పెనుకొండ గ్రామ పంచాయతీగా ఉన్నపుడు 61 మంది కార్మికులు సేవలందించేవారనీ, నగర పంచాయతీ అయ్యాక 44 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీంతో పారిశుధ్య పనులకు ఇబ్బంది అవుతోందనీ, సిబ్బందిని నియమించాలని కోరారు. మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారని సవిత తెలిపారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సవిత

కలెక్టర్, ఎస్పీని కలిసిన పరిటాల సునీత



కలెక్టర్, ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



పుట్టపర్తి రూరల్, ఆగస్టు 29: జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్నను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వారి కార్యాలయాల్లో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో, శాంతిభద్రతలపై ఎస్పీతో చర్చించినట్లు సమాచారం.

టీచర్లను బోధనకు పరిమితం చేయాలి

కొత్తచెరువు, ఆగస్టు 29: టీచర్లను బోధనకు పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో గురువారం ఈ మేరకు ఏడీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. శెట్టిపి మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు రోజూ సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫారం నింపి, ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్ఎంసీ చైర్మన్, సచివాలయ సిబ్బంది మరుగుదొడ్ల ఫొటోలు తీయకపోతే ఆ బాధ్యత ప్రధానోపాధ్యాయుడు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడం సరికాదన్నారు. దీనిపై పునరాలోచించి, యాప్‌ల బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



ఉమేష్‌కుమార్, సూరజ్, లవకుమార్ మృతదేహాలు

హిందూపురం, ఆగస్టు 29: జిల్లాలో గురువారం రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. హిందూపురం-బెంగళూరు ప్రధాన రహదారిపై మండలంలోని చౌళూరు గేటువద్ద బుధవారం రాత్రి కారు బోల్తాపడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మృతిచెందారు. తూముకుంట పారిశ్రామికవాడలోని స్టీల్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉమేష్‌కుమార్ (38) సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండేవారు. గురువారం రాత్రి గౌరీబిదునూరు నుంచి తూమకుంట పారిశ్రామికవాడకు కారులో వస్తుండగా చౌళూరు గేటు వద్ద బోల్తాపడింది. ఉమేష్‌కుమార్, డ్రైవర్ సూరజ్ (36) మృతిచెందాడు. వీరి దేహాలను గౌరీబిదునూరు ఆస్పత్రికి తరలించారు. గౌరీబిదునూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని కార్మికుడు..

పెనుకొండ రూరల్: మండలంలోని హరిపురం వైజంక్షన్ వద్ద 44వ జాతీయరహదారిపై గురువారం బైక్‌ను లారీ ఢీకొట్టడంతో కార్మికుడు లవకుమార్(19) మృతిచెందాడు. రొద్దం మండలం పెద్దమంతూరు గ్రామానికి చెందిన లవకుమార్ కియ అనుబంధ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. విధుల్లో భాగంగా బైక్‌లో పెనుకొండ నుంచి కియ వైపు వెళ్తుండగా.. హరిపురం వైజంక్షన్ వద్ద బెంగళూరు నుంచి టెంకాయల లోడుతో వెళ్తున్న లారీ వెనుకనుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన లవకుమార్‌ను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మృతిచెందాడు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు కియ ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

మఠం భూమిని కాపాడండి

పేదలకు ఇళ్ల పట్టాలివ్వండి

రెవెన్యూశాఖ మంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినతి

ధర్మవరం, ఆగస్టు 29: బత్తలపల్లిలోని జంగం మఠం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి, పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రిని గురువారం కలిసి, ధర్మవరంలో భూకబ్జాలపై వినతిపత్రం అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. బత్తలపల్లిలో 401 సర్వే నంబరులో రూ.100కోట్ల విలువచేసే 19.84 ఎకరాల మఠం భూమిని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులు కాజేయాలని 1బీలో పిత్రార్జితంతో పేర్లు నమోదు చేయించారన్నారు. అది గతంలో ప్రభుత్వ రికార్డుల్లో నిడిమామిడి జంగం మఠం భూమిగా ఉండేదన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులు ఈశ్వర్‌రెడ్డి, టీఎల్ రామాంజనేయులుకు ఆ భూమిపై ఎటువంటి హక్కులు లేకున్నా అక్రమమార్గంలో సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ధర్మవరంలోని కేశవనగర్ పరిధి సర్వేనంబరు 338లో పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, నియోజకవర్గ కార్యదర్శి మధు పాల్గొన్నారు.



మంత్రి సత్యప్రసాద్‌కు విన్నవిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

రేపే పింఛన్

పుట్టపర్తి, ఆగస్టు 29: ఎన్టీయార్ భరోసా పింఛన్‌ను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ అందజేసేవారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 31నే పింఛన్ సొమ్ము ఇవ్వనున్నారు. అందులో భాగంగా శుక్రవారమే బ్యాంకుల నుంచి డబ్బు డ్రాచేసి, ఆయా మండలాల అధికారులు, కమీషనర్లకు చేర్చాలంటూ జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశించారు. జిల్లాలో 2,68,079 మంది లబ్ధిదారులు ఉండగా.. రూ.115 కోట్లు విడుదలైంది. 31న పింఛన్ తీసుకోలేని వారికి సెప్టెంబరు 2న ఇవ్వనున్నారు.

పలువురి బదిలీ

పుట్టపర్తి, ఆగస్టు 29: జిల్లాలో పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య నరసాపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కదిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రహ్లాద్‌ను నియమించారు. కర్నూలులో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులును పెనుకొండ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ధర్మవరం మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డిని పుంగనూరు కమిషనర్‌గా, హిందూపురం మేనేజర్ మోహన శ్రీనివాసరావును ఉయ్యూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

తియ్యని భాష తెలుగు: కలెక్టర్



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 29: తెలుగు భాష తియ్యనైనదని కలెక్టరు వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తాను కర్ణాటక నుంచి వచ్చినా.. తెలుగు భాషను నేర్చుకున్నానని కలెక్టర్ అన్నారు. ప్రతి సమావేశంలో తాను తెలుగులోనే మాట్లాడుతున్నానని గుర్తు చేశారు. తెలుగు భాషను రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతంలో ఒకలా మాట్లాడుతారని, భాషాభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఆరోగ్యానికి క్రీడలు అవసరమని, ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

రేపు పింఛన్ పంపిణీ: కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29: పింఛన్‌దారులకు శనివారం ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందజేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌డీఓ-వెలుగు పీడీ ఓబుళమ్మ, ఆర్డీఓలు, ఎల్‌డీఎం, బ్యాంకు అధికారులు, ఎంపీడీలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2, 86 లక్షల మందికి రూ.125.71కోట్ల నిధులు

జిల్లాలో 2,86,795 మంది పింఛన్‌దారులకు రూ.125.71కోట్లు నిధులు మంజూరు చేశారు. వృద్ధులు 1,42,181 మందికి రూ.56.87కోట్లు, వితంతువులు 66,563 మందికి రూ.26.62కోట్లు, చేనేతలు 6,671 మందికి రూ.2.66కోట్లు, కల్లుగీత కార్మికులు 354 మందికి రూ.14లక్షలు, మత్స్యకారులు 885 మందికి రూ.35లక్షలు, ఒంటరి మహిళలు 6,710 మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మాచారులు 3,505 మందికి రూ.1.41కోట్లు, హిజ్రాలు 206 మందికి రూ.82వేలు, హెచ్‌ఐవి బాధితులు 2,437 మందికి రూ.రూ.97లక్షలు, డప్పు కళాకారులు 3,117 మందికి రూ.1.24కోట్లు, కళాకారులు 181 మందికి రూ.72వేలు, దివ్యాంగులు 46,184 మందికి రూ.27.71కోట్లు, కుష్టు వ్యాధి బాధితులు 384 మందికి రూ.23లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,438 మందికి రూ.2,15కోట్లు, ప్రమాద బాధితులు 1082 మందికి రూ.1.62కోట్లు, అభయహస్తం 4,232 మందికి రూ.21లక్షలు ఇతరత్ర బాధితులకు కలిపి మొత్తం 2,86,795మందికి రూ.125.71కోట్లు నిధులు విడుదల చేశారు.

అదనపు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 29: అంబేడ్కర్ గురుకులాల్లో అదనంగా కేటాయించిన 183 సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కురుగుంట పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి సంబంధించి 10, 6వ తరగతికి 04, 7వ తరగతికి 01, 8వ తరగతికి 05 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. తిమ్మాపురం పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 09 సీట్లు, ఉరవకొండ పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 05, 8వ తరగతికి 01, గుత్తి పాఠశాల (బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 08, 7వ తరగతికి 06, 8వ తరగతికి 05 సీట్లు కేటాయించారన్నారు. బ్రహ్మసముద్రం పాఠశాల(బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 07, 7వ తరగతికి 02, కొర్రపాడు పాఠశాల(బాలికలు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 07, 8వ తరగతికి 02 అదనంగా కేటాయించారన్నారు. కణేకల్లు పాఠశాల(బాలురు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 10, 7వ తరగతికి 05, బి. పప్పూరు పాఠశాల(బాలురు)లో 5వ తరగతికి 10, 6వ తరగతికి 07, 7వ తరగతికి 15, 8వ తరగతికి 04 సీట్లు చొప్పున మొత్తం 183 అదనపు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. అయితే 5వ తరగతికి సంబంధించి ఇదివరకూ జరిగిన బ్రాగ్‌సెట్-2024లోని మెరిట్ ఉన్న విద్యార్థులతో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 6,7,8 తరగతుల సీట్లకు సంబంధించి ఆయా పాఠశాలల్లో శుక్ర, శనివారాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 11 గంటలకు ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు అదనపు సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ఖాళీల వివరాలు ఆయా పాఠశాలలు, లేదా డీసీఓ కార్యాలయం నోటీసు బోర్డులలో ప్రదర్శించడం జరిగిందన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

మూడు ఇళ్లలో చోరీకి దొంగల యత్నం



రత్నమయ్య ఇంట్లో విచారిస్తున్న పోలీసులు

యాడికి, ఆగస్టు 29: వివిధ పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసుకుని ఊర్లకు వెళ్లే వారిని టార్గెట్ చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. ఆ ఇళ్లల్లో చోరీకి పాల్పడుతున్నారు. ఇటువంటి సంఘటన బుధవారం రాత్రి యాడికిలో చోటు చేసుకుంది. రామస్వామి కాలనీలోని రెండిళ్లల్లోనూ, కెనరాబ్యాంకు కాలనీలోని ఓ ఇంటిలో దొంగలు చోరీకి ప్రయత్నించారు. చోరీయత్నం జరిగిన మూడు ఇళ్లకు తాళాలు వేసి ఉండటం గమనార్హం. రామస్వామికాలనీలోని రత్నమయ్య ధర్మవరానికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. అదేవిధంగా వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. కెనరాబ్యాంకు వీధిలో ఉన్న రాముడు అరుణాచలేశ్వరుడి దర్శనానికి వెళ్లాడు. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో దొంగలు ఈ మూడిళ్లల్లో చోరీకి ప్రయత్నించారు. తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసిన స్థానికులు ఇంటివారికి ఫోన్‌చేయడంతో వారి సమీప బంధువులు ఇళ్లను పరిశీలించారు. అయితే విలువైన వస్తువులు చోరీకి గురికాకపోవడంతో యజమానులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు ఆయా ఇళ్లను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అయితే కాలనీవాసులు మాత్రం భయాందోళనలకు గురవుతున్నారు. మూడు ఇళ్లల్లో ఒకేరోజు చోరీకి యత్నించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

తాగుబోతుల వీరంగం



గాయపడిన శ్రీరాములు, సంజీవరాయుడు

గుత్తి, ఆగస్టు 29: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఓ కల్లు దుకాణం వద్ద గురువారం తాగుబోతులు వీరంగం సృష్టించారు. తాగిన మైకంలో కల్లు దుకాణ యజమాని శ్రీరాములతో గంగరాజు, దేవా తదితరులు గొడవపడ్డారు. రాళ్లు, కర్రలతో దాడి చేశారు. అడ్డుకోబోయిన శ్రీరాములు కూతురు లీలావతి, జనార్దన్‌పై కూడా దాడి చేశారు. సర్దిచెప్పడానికి వెళ్లిన మరో దుకాణదారు సంజీవరాయుడు, మల్లేశ్వరిపైనా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వారిని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీరాములు, సంజీవరాయుడు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. ఈ గొడవలో గంగరాజు, దేవా కూడా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి తేలు కాటు



చికిత్స పొందుతున్న వన్నూరుస్వామి

బొమ్మనహాళ్, ఆగస్టు 29: పాఠశాలలో తేలు కుట్టి ఓ విద్యార్థి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్న సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వన్నూరుస్వామి 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాల జరుగుతున్న సమయంలో బ్యాగ్లలోని పుస్తకాలు తీస్తుండగా తేలు కుట్టింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. మూడురోజుల నుంచి అక్కడే చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్నా పాఠశాల ఉపాధ్యాయులు పిల్లాడు ఎలా ఉన్నాడని కనీసం వాకబు చేయలేదని తండ్రి దేవప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై ఎంఈఓ మల్లికార్జునను వివరణ కోరగా విద్యార్థికి తేలు కుట్టిన విషయం తెలియదని దీనిపై విచారిస్తామన్నారు.

చేనేతకు పూర్వవైభవం..!

- పట్టువస్త్రాల తయారీకి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం
- మగ్గాలు, పరికరాల పంపిణీకి శ్రీకారం
- వర్క్‌షెడ్ల నిర్మాణాలు, పాత మగ్గాల ఆధునికీకరణకు ప్రణాళిక
- అధికారులతో వరుస సమావేశాలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 29: వ్యవసాయం తరువాత అత్యధికంగా ప్రజలు ఆధారపడ్డ చేనేత రంగానికి పూర్వవైభవం సంతరించుకుంటోంది. పట్టు వస్త్రాల తయారీలో దేశంలోనే ప్రతిభకలిగిన చేనేతలు ఉమ్మడి జిల్లా సొంతం. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేనేత రంగాన్ని నిర్వీర్యం చేయడంతో నేతన్నల ప్రతిభ, జిల్లా ఖ్యాతి మసక బారింది. 2014-19వరకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన చేనేత పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలను ఎత్తివేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం పక్కదారి పట్టించింది. ఏడాదికి రూ.24వేలు చెల్లించే నేతన్న నేస్తం పథకాన్ని మాత్రమే అమలు చేసింది. ఈ పథకంలోనూ అర్హులకు అన్యాయంచేస్తూ వైసీపీ కార్యకర్తలు, నాయకులకు రూ.24వేలను కట్టబెట్టింది. వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగడుతూ అనేకసార్లు చేనేతలు రోడ్లెక్కి నిరసనలు, ర్యాలీలు చేశారు. తాము అధికారంలోకి వస్తే చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకువస్తామని టీడీపీ హామీనిచ్చింది. ఆ మేరకు చేనేత రంగాన్ని ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

క్షేత్రస్థాయి పర్యటనలు

చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధిని కల్పించే వస్త్ర తయారీ రంగాన్ని బలోపేతం చేసేదిశగా కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రాంతాలవారిగా క్లస్టర్లుగా విభజిస్తున్నారు. జిల్లా చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఒక్కో క్లస్టర్‌లో 300 మందికిపైగా తగ్గకుండా చేనేతలను గుర్తిస్తున్నారు. వారికి నూతన మరమగ్గాలు, పరికరాలు అందజేసేలా వివరాలను క్రోడీకరిస్తున్నారు. స్థానిక వనరులకు అనుగుణంగా వర్క్‌షెడ్లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వీటితోపాటు పాత మగ్గాలను గుర్తించి వాటిని ఆధునికీకరించేందుకు అవసరమైన పరికరాలను అందజేసేందుకు వివరాలను సేకరిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వివరాలను తీసుకుంటున్నారు.

90 శాతం రాయితీ

ఉమ్మడి జిల్లాలో దాదాపు 50వేల మగ్గాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు నేతలు మగ్గం నేస్తున్నారు. అనేక మంది కార్మికులు వర్క్‌షెడ్లలో పనిచేస్తున్నారు. ఇలాంటి వారికి సొంత మగ్గం కలను ప్రభుత్వం నెరవేర్చనుంది. 10 శాతం పెట్టుబడి పెట్టిన నేతలకు 90శాతం రాయితీతో మగ్గాలను అందజేయనున్నారు. అదేవిధంగా శారీరక శ్రమను తగ్గించేందుకు రెండు, మూడు లివర్‌ల లిఫ్టింగ్ మిషన్‌లు, జాకాట్‌లను కూడా 90 శాతం రాయితీతో పంపిణీచేయనుంది. వీటికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తాధ్వర్యంలో ముద్ర వంటి బ్యాంకు రుణాల పథకాలను కొనసాగిస్తున్నారు. వీటితోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో అమలుచేసిన ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని తిరిగి పునఃప్రారంభించారు.

ఫిర్యాదుల స్వీకరణ...

చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పారదర్శకంగా అర్హులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. మగ్గమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న ఏ ఒక్క నేత కార్మికుడు ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకూడదన్న ఉద్దేశంలో ముందుకు సాగుతోంది. పథకాలు అందని వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా చేనేత జౌళిఖ కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయించింది.

టెక్స్‌టైల్, అపెరల్ పాలసీ

వస్త్ర తయారీని ఆధునికీకరించి ఉత్పాదకతను మెరుగు పరిచేందుకు 2015లో టెక్స్‌టైల్ అపెరల్ పాలసినీ రూపొందించారు. సీఐఐ, ఎఫ్ఏపీఎస్ఐఏ, ఏఎల్ఈఏపీ, స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్స్‌తో సంప్రదించి విధివిధాలను రూపొందించారు. తద్వారా టెక్స్‌టైల్ పరిశ్రమలు, మెగా ప్రాజెక్ట్, అపెరల్ పార్కులు, ఐఐటీల్లో డిజైనింగ్ కోర్సులు, శిక్షణ కేంద్రాలు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలను ఆమోదించారు. డిజైనింగ్ డైయింగ్, ప్రాసెసింగ్, స్పిన్నింగ్, గార్మెంట్, మెషిన్ కార్పెటింగ్, ఎంబ్రాయిడరీ, టెక్నికల్ టెక్స్‌టైల్, క్రింపింగ్, టెక్చరైజింగ్, ట్విస్టింగ్, వైండింగ్, సిజింగ్ తదితర వాటికి రాయితీలను అందించారు. వైసీపీ ప్రభుత్వం వాటన్నిటిని ఎత్తివేసి నేరుగా నగదు బదిలీ పేరుతో నేతన్న నేస్తాన్ని తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాలసినీ సవరించి మరిన్ని సౌకర్యాలను చేర్చి మళ్లీ అమలుచేయనుంది.



క్షేత్రస్థాయిలో చేనేతల వివరాలను పరిశీలిస్తున్న ఏడీఓ మురళీమోహన్ (ఫైల్)



జిల్లా కార్యాలయంలో ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేసిన అధికారులు



ముద్ర రుణాల దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఏడీఓ శ్రీనివాసులు (ఫైల్)

ఐఎస్‌ఓ మార్కు తీసుకువస్తాం

దేశీయ, అంతర్జాతీయ డిమాండ్లకు అనుగుణంగా వస్త్ర తయారీలో నాణ్యతను పెంచి రాష్ట్ర చేనేత రంగానికి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్స్ (ఐఎస్‌ఓ) మార్కును తీసుకువస్తాం. ప్రతి నేత పట్టునేయడంలో అత్యంత ప్రతిభను కలిగివున్నాడు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో మళ్లీపూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాం. క్లస్టర్ల వారిగా చేనేతల సంఖ్యకు అనుగుణంగా 90శాతం రాయితీతో నూతన మగ్గాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పాత మగ్గాల ఆధునికీకరణకు కొత్త పరికరాలను అందజేసేలా సర్వే ప్రక్రియను చేపట్టాం.

-సవిత, రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి

గుంతకల్లు డీజిల్ షెడ్.. షష్టిపూర్తి

- వేధిస్తున్న స్పేర్‌పార్ట్స్, పనిముట్ల కొరత
- కార్మికులకు పెనుభారంగా మరమ్మతులు
- ఎలక్ట్రికల్ ట్రాక్షన్ షెడ్డుగా మారే అవకాశం



మరమ్మతుల కోసం వచ్చిన పాత డీజిల్ ఇంజిన్లు

గుంతకల్లు, ఆగస్టు 29: రైల్వే డివిజనల్ కేంద్రంలోని డీజిల్ షెడ్ నేటితో అరవై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇంత ఘనచరిత్ర కలిగిన ఈ డీజిల్ షెడ్‌లో తగిన పనిముట్లు, స్పేర్‌పార్ట్స్ లేవు. పేరుకే ఇది డీజిల్ షెడ్. కాలానికి అనుగుణంగా విద్యుత్ లోకో షెడ్‌గా మారుతోంది. రైల్వేశాఖ ఇంధన ఖర్చులను తగ్గించుకోవడానికి డీజిల్ ఇంజన్ల స్థానంలో విద్యుత్ లోకోలను ప్రవేశపెడుతున్న కారణంగా డీజిల్ ఇంజన్ల సంఖ్య తగిపోయి, విద్యుత్ లోకోల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పక్కనే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్ నిర్మాణంలో ఉన్నందున డీజిల్ షెడ్ తన అస్తిత్వాన్ని కోల్పోయి పూర్తిస్థాయిలో విద్యుత్ షెడ్‌గా రూపాంతరం చెందనుంది. ప్రస్తుతానికి డీజిల్, విద్యుత్ షెడ్లు ఉన్నా రెండింటిలోనూ చాలా పాత ఇంజన్లు ఉండటంతో కార్మికులకు భారంగా పరిణమించింది.

వేధిస్తున్న స్పేర్స్, పనిముట్ల కొరత

అరవైయ్యేళ్ల ఘనమైన పేరున్న గుంతకల్లు రైల్వే డీజల్ షెడ్‌లో పనిచేయడానికి తగిన పనిముట్లు, రైలింజన్లకు అవసరమయ్యే స్పేర్స్ లేక మెకానికల్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక ఇంజన్ రిపేరుకు వస్తే దానికి అవసరమయ్యే స్పేర్‌ను ఇంకో ఇంజన్ నుంచి తీసి దానికి తగిలించడం, మరొక ఇంజన్ రిపేరుకు వచ్చినప్పుడు దాని స్పేర్లను మునుపటి ఇంజన్‌కు బిగించి పంపడం చేస్తూ నెట్టుకొస్తున్నారు. గుంతకల్లు డీజల్ షెడ్‌తోపాటు, ఎలెక్ట్రికల్ లోకో షెడ్‌కు అన్నీ పాత ఇంజన్లనే కేటాయించడంతో స్పేర్స్ సమస్యతో సతమతమౌతున్నారు. గుంతకల్లులో నూతనంగా విద్యుత్ లోకోల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటుచేసినా, దానికి కొత్త లోకోలను ఇవ్వలేదు. స్పేర్స్, టూల్స్ లేక పని డబుల్ అవుతోందని రైల్వే డీజల్ షెడ్ కార్మికులు వాపోతున్నారు. పక్కనే ఉన్న గుత్తి డీజిల్ షెడ్‌కు గత నెలలో కొత్త డీజిల్ లోకోలను ఇచ్చారు. కాగా డీజిల్ వినియోగాన్ని తగ్గించి తద్వారా ఖర్చులు తగ్గించుకోవడానికి రైల్వే శాఖ విద్యుత్ వినియోగాన్ని పెంచే కార్యాచరణను పెంచింది. ఈ మేరకు రైల్వే డివిజన్‌లో వంద శాతం లైన్ల విద్యుద్దీకరణ కూడా పూర్తయింది. ఈ పరిస్థితుల్లో అన్నేసి డీజిల్ ఇంజన్లను కొని గుత్తికి పంపడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అస్తిత్వాన్ని కోల్పోతున్న డీజిల్ షెడ్డు

గుంతకల్లులోని రైల్వే డీజిల్‌షెడ్ కాలానికి అనుగుణంగా తన అస్తిత్వాన్ని కోల్పోతూ వస్తోంది. కేంద్రం రైల్వేలను వందశాతం విద్యుద్దీకరణ చేయడానికి పదేళ్ల కిందట కార్యాచరణ ప్రారంభించింది. ఈ మేరకు లైన్లను విద్యుద్దీకరించడం, విద్యుత్ లోకోలను ప్రవేశపెట్టడం, తదితర కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా గుంతకల్లులో విద్యుత్ లోకోల మరమ్మతుకు ట్రాక్షన్ షెడ్ నిర్మాణం చేపట్టింది. దాని నిర్మాణం పూర్తికాకమునుపే పాక్షికంగా పూర్తయిన షెడ్‌లోనే విద్యుత్ లోకోల మరమ్మతులను చేయడం ప్రారంభించారు. కొందరు టెక్నీషియన్లకు, మెకానిక్‌లకు ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. శిక్షణ తీసుకొని కార్మికులు, సాంకేతిక సిబ్బందిచేత డీజిల్ లోకోలను రిపేరిచేయిస్తూ, తర్ఫీదు పొందిన వారి చేత విద్యుత్ లోకోలను మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీజిల్ లోకోల సంఖ్యను తగ్గించేసి విద్యుత్ లోకోలను పెంచారు. ఈ కారణంగా ప్రస్తుతం కేవలం 30 డీజిల్ ఇంజన్లు ఇక్కడ ఉండగా, 180 విద్యుత్ లోకోలు వచ్చి చేరాయి. మరి కొన్నేళ్లలో డీజిల్ ఇంజన్లు అంతరించి కేవలం విద్యుత్ లోకోలు మాత్రమే ఇక్కడ మరమ్మతులు చేసే పరిస్థితులు ఏర్పడనున్నాయి. కాగా డీజిల్ షెడ్‌లో తాగునీటి వసతి లేదని, టాయిలెట్లు లేవని, మహిళా ఉద్యోగులకు విశ్రాంతి గది వసతిని ఏర్పాటు చేయలేదని సిబ్బంది విమర్శిస్తున్నారు. ఈనెల 30వ తేదీకి డీజిల్ షెడ్ ఏర్పాటై 60 ఏళ్లు కానుంది. ఈ షెడ్ ఇక ఎన్నేళ్లు కొనసాగుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. సమీప భవిష్యత్తులో దీన్ని పూర్తిగా ఎలక్ట్రికల్ ట్రాక్షన్ షెడ్‌గా మార్చే అవకాశాలున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో దులీప్ ట్రోఫీ

- అదేస్థాయిలో భద్రత, సదుపాయాల కల్పన
- సెప్టెంబరు 5 నుంచి 22 వరకు పోటీలు
- దేశంలోని టాప్ క్రికెటర్ల రాక
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్




మాట్లాడుతున్న మాంచోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29: దులీప్ ట్రోఫీని అంతర్జాతీయ ప్రమాణాలతో అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ)లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు, ఆర్డీటీ ప్రోగాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ తెలిపారు. జిల్లా క్రికెట్ చరిత్రలో నిలిచిపోయేవిధంగా నిర్వహణ ఉంటుందన్నారు. గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా క్రికెట్ పండుగ జరగబోతోందని, క్రికెట్ ప్రేమికులకు ఇదొక అరుదైన అనుభూతినిచ్చే వేడుక అని అన్నారు. పెద్దపెద్ద నగరాలు ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్, విలాసవంతమైన సదుపాయాలు ఉండే ప్రాంతాల్లో దులీప్ ట్రోఫీని నిర్వహిస్తారని, అటువంటిది జిల్లాకు కేటాయించడం గర్వకారణమన్నారు. దేశంలోని టాప్ క్రికెట్ ప్లేయర్లు జిల్లాకు వచ్చి క్రికెట్ ఆడుతారని, జిల్లాకు గొప్పగొప్ప అవకాశాలు వస్తాయనేందుకు ఇదొక సంకేతమని చెప్పారు. ఇంటర్నేషనల్ పోటీల తరువాత జాతీయ క్రీడాకారులకు అత్యంత ప్రధానమైనది దులీప్‌ట్రోఫీ అని అన్నారు. ఈ ట్రోఫీలో ప్రదర్శన ఆధారంగానే బీసీసీఐ ఇండియా క్రికెట్ జట్టును ఎంపిక చేస్తుందన్నారు. పోటీలకు ఇండియా సెలెక్టర్లు, కామెంటేటర్లు హాజరవుతారన్నారు. స్టార్‌స్పోర్ట్స్, జియో చానళ్లల్లో లైవ్ టెలికాస్ట్ ఉంటుందని, ఇందుకు అనుగుణంగా భద్రతా చర్యలు, సదుపాయాలు కల్పిస్తామన్నారు. రోజుకు కేవలం 4వేల మందికి మాత్రమే పాసులు జారీ చేస్తామని, పాసులు లేకపోతే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మ్యాచ్‌రోజు ఉదయం 8.30గంటల నుంచి ఉదయం 10.30గంటల వరకు మాత్రమే పాసులు ఉన్నవారికి అనుమతి ఉంటుందన్నారు. మొదటి మ్యాచ్ ఇండియాసి-ఇండియా డి జట్ల మధ్య సెప్టెంబరు 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు, రెండో మ్యాచ్ ఇండియాఏ-ఇండియా డి జట్ల మధ్య సెప్టెంబరు 12 నుంచి 15 వరకు, మూడో మ్యాచ్ ఇండియా బి-ఇండియా సి జట్ల మధ్య సెప్టెంబరు 12 నుంచి 15వ తేదీ వరకు బీ గ్రౌండ్‌లో, నాలుగో మ్యాచ్ ఇండియా ఏ-ఇండియా సి జట్ల మధ్య సెప్టెంబరు 19 వతేదీ నుంచి 22వ తేదీ వరకు, ఐదో మ్యాచ్ ఇండియా బి-ఇండియా డి జట్ల మధ్య సెప్టెంబరు 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బీ గ్రౌండ్‌లో నిర్వహిస్తారని తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీన ప్లేయర్లు అనంతకు చేరుకుంటారన్నారు. 3, 4వ తేదీలలో ఏసీజీలో ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి, కమిటీ సభ్యులు పగడాల మల్లికార్జున, జొన్నా జయప్రకాష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణవేణిపై విచారణ

అనంతపురం టౌన్, ఆగస్టు 29: డీసీహెచ్‌ఎస్‌గా గతంలో పనిచేసిన డాక్టర్ కృష్ణవేణి ఎదుర్కొంటున్న ఆరోపణలపై విచారణ అధికారి, మచిలీపట్నం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. డాక్టర్ కృష్ణవేణి ఉద్యోగ నియామకాలలో అవకతవకలకు పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా డెప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఒక ఉద్యోగికి హిందూపురం, అనంతపురం కార్యాలయాలలో రెండుచోట్ల జీతాలు చెల్లించారని, కారు పర్మిషన్, అద్దె కారు విషయంలోను నిబంధనలు పాటించలేదని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఆమె ఉద్యోగోన్నతి కూడా నిబంధనలకు విరుద్ధంగా పొందారని కూడా ఫిర్యాదులు వెళ్లాయి. విచారణ అధికారి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్ ద్వారా ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని ప్రశ్నించి, వివరాలు నమోదు చేసుకున్నారు. డాక్టర్ కృష్ణవేణిపై ఏసీబీకి కూడా ఫిర్యాదులు వెళ్లాయని, ఇటీవల ఏసీబీ అధికారులు డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో విచారించారని సమాచారం. డాక్టర్ కృష్ణవేణి ప్రస్తుతం తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు.

భార్య మృతి.. తట్టుకోలేక భర్త కూడా..



పంపాపతి, గంగమ్మ (ఫైల్ ఫొటోలు)

డీ.హీరేహాళ్, ఆగస్టు 29: కట్టుకున్న భార్య అనారోగ్యంతో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక భర్త గుండెపోటుతో మృతిచెందాడు. మండలంలోని నల్లదిబ్బ గ్రామానికి చెందిన గొల్ల పంపాపతి(65), భార్య శివగంగమ్మ(58) వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగించేవారు. వీరికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారం క్రితం శివగంగమ్మకు జ్వరం రావడంతో బళ్లారిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం మధ్యాహ్నం చనిపోయింది. ఆమెకు తోడుగా ఆసుపత్రిలో ఉన్న భర్త పంపాపతి.. భార్య చనిపోగానే తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. భార్య ఇక లేదన్న విషయాన్ని జీర్ణించుకోలేక గుండెపోటుతో ఆసుపత్రిలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే వైద్యులు పరీక్షించారు. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు దిక్కులేనివారయ్యారు. వీరి పెద్ద కుమారుడు విభిన్న ప్రతిభావంతుడు.

బీటెక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 29: బీటెక్ ఇంజినీరింగ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. ఈఏపీసెట్ అర్హత సాధించిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన సీట్లను భర్తీచేసేందుకు 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492473714 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫీజు గడువు పొడిగింపు

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ వరకు వున్న గడువును సెప్టెంబరు 18వ తేదీ వరకు పెంచడం జరిగిందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీడిపల్లికి 931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 29: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం 931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 1.551 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు 29: అనంతపురం న్యూటౌన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల్లో పనిచేయడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఫీమేల్, లైవ్ స్టాక్ మేనేజ్‌మెంట్ అండ్ డైరీయింగ్ (ఎల్ఎం అండ్ డి), సివిల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ (సీ.ఈ.టీ) సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు బీఎస్సీ నర్సింగ్, ఎల్ఎం అండ్ డి కోర్సుకు బ్యాచిలర్ ఆఫర్ వెటర్నరీ సైన్స్, సీఈటీ కోర్సుకు బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 31వ తేదీ మధ్యాహ్నం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

ఎంటెక్, ఎంబీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 29: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్, ఎంబీఏ పరీక్షా ఫలితాలను గురువారం డైరెక్టర్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదలచేశారు. ఫలితాలకోసం www.jntua-results.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 146 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 2650 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.6పలికినట్లు ఆయన తెలిపారు.


కదిరి బ్లూమూన్ పాఠశాలలో విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఓడీసీలో గిడుగు రామ్మూర్తి పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ధర్మవరం గ్రంథాలయంలో..


గొట్లూరు శ్రీనివాస విద్యానికేతన్‌లో..


ధర్మవరం సూర్య పాఠశాలలో విశ్రాంత తెలుగు పండితులకు సన్మానం


కొత్తచెరువు శ్రీచైతన్యపాఠశాలలో...

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం, ఆగస్టు 29 : తెలుగు భాషను ఎవరూ మరువరాదని, దాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక సత్య కృప మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆ కళాశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి ఆయనతో పాటు విద్యార్థినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషాభివృద్ధి చేసిన కృషిని విద్యార్థులకు కరస్పాండెంట్ వివరించారు. అదేవిధంగా ధర్మవరం శాఖా గ్రంథాలయంలోనూ తెలుగు భాష దినోత్సవాన్ని గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కాకతీయ విద్యానికేతన్, యశోద కాన్సెప్ట్ స్కూల్, సూర్య ఇంగ్లీషు మీడియం పాఠశాల, ధర్మవరం మండలంలోని నాగలూరు వద్ద గల రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవాన్నీ నిర్వహించారు.

- ధర్మవరంరూరల్ : ధర్మవరం పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే రూరల్ మండలంలోని గొట్లూరు శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కదిరి : పట్టణంలోని సాధన ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఎస్‌టీఎస్‌ఎన్ కళాశాల, బ్లూమూన్ పాఠశాల, షిర్డిసాయి పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.
- కొత్తచెరువు: శ్రీచైతన్య పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.
- ఓబుళదేవరచెరువు : స్థానిక జ్ఞానసాయి ప్రైవేటు పాఠశాలలో గిడ్డుకు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.
- గాండ్లపెంట: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.
- ముదిగుబ్బ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ క్రీడాకారులకు రూ. 30 వేల విలువైన ఆర్చరీ కిట్, క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రిని అందజేశారు. తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.
- బుక్కపట్నం : క్రీడా దినోత్సవం సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.
- బత్తలపల్లి : స్థానిక బాలికల, గురుకుల పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు.


ముదిగుబ్బలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు


బత్తలపల్లి బాలికల పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం


ధర్మవరంలో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు


గాండ్లపెంటలో విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు


కదిరి సాధన ఉన్నత పాఠశాలలో...

మహిళలపై నేరాలను అరికడదాం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 29: మహిళలపై నేరాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రత్న.. పోలీసు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దాడులు చేస్తూ వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరచిన 36 మంది పోలీసు అధికారులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు, శ్రీలత, మహేష్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నేరసమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

నేడు పరిటాల రవీంద్ర జయంతి

ధర్మవరం, ఆగస్టు 29 : మాజీ మంత్రి, దివంగత పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలను టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా స్థానిక గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు గాంధీనగర్ టీడీపీ కార్యాలయం, కదిరిగేటు చేనేత విగ్రహం వద్ద, ప్రభుత్వాస్పత్రి పక్కన ఉన్న అన్నక్యాంటీన్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద, లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో అన్నదానం చేస్తామన్నారు. కావున ఈ సామాజిక సేవా కార్యక్రమాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, తెలుగు యువత, తెలుగు మహిళలు, టీఎన్ఎస్ఎఫ్, అనుబంధసంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పల్లె ఉమా వర్ధంతికి తరలిరండి

కొత్తచెరువు, ఆగస్టు 29 : పుట్టపర్తి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా ఆరో వర్ధంతి కార్యక్రమానికి తరలిరావాలని టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అనంతపురంలోని పల్లె ఎస్టేట్ ఆవరణంలో పల్లె ఉమా ఘాట్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం 10 గంటలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలిరావాలని కోరారు.

నల్లమాడ : పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమా వర్ధంతి సందర్భంగా శుక్రవారం అనంతపురంలో పల్లె ఘాట్ వద్దకు నివాళులర్పిస్తున్నామని, దీనికి అధిక సంఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మండల కన్వీనర్ మైలే శివశంకర్ కోరారు.

వృద్ధాశ్రమానికి సరుకుల పంపిణీ

కదిరి, (అమడగూరు), ఆగస్టు 29: మండలంలోని గాజులపల్లిలో ఉన్న వృద్ధాశ్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమా ఆరో వర్ధంతి సందర్భంగా నిత్యావసర వస్తువులు అందించారు. గురువారం ఓబుళదేవచెరువు మండలంలోని ఉపాధి హామీ క్షేత్రసహాయకులు ఆశ్రమ నిర్వాహకులకు రూ.5వేలు విలువ చేస్తే నిత్యవసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో పీట్ల మనోహర్, అక్కులప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వత్రం

కదిరి, ఆగస్టు 29: స్థానిక శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వత్రం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఆలయానికి చేరుకోవాలన్నారు. వత్రానికి పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, పూవ్వులు, పండ్లు, గాజులు తదితర పూజా సామగ్రిని ఆలయం వారే అందజేస్తారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వరలక్ష్మీవత్ర కార్యక్రమంలో పాల్గొని, స్వామి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

కొత్తచెరువు: స్థానిక జూనియర్ కళాశాలలో, బుక్కపట్నంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుపై గురువారం అవగాహన కార్యక్రమాలను వన్‌స్టాప్ సెంటర్ సభ్యులు నిర్వహించారు. పీఎంకేవీవై స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై విద్యార్థులకు మెళకువలను ఇచ్చామని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ధర్మవరం, ఆగస్టు 29 : స్థానిక బీజేపీ కార్యాలయంలో పట్టణ, మండలాల కార్యకర్తల సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హరీశ్ మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక కార్యకర్త భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీశ్‌కుమార్, సభ్యత్వ నమోదు జిల్లా సహ ప్రముఖ్‌సాకే ఓబులేసు, నాయకులు గుండాపుల్లయ్య, భక్తవత్సలం పాల్గొన్నారు.

మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

నంబులపూలకుంట, ఆగస్టు 29 : స్థానిక నాలుగురోడ్ల కూడలి, బస్‌షెల్టర్, చిరు దుకాణాలు ఉన్న ప్రదేశంలో మురుగు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికతో నిండిపోయింది. దీంతో మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈ దుర్వాసన వల్ల వినియోగదారులు కూడా రావడం లేదని దుకాణాదారులు వాపోతున్నారు. ఈ మురుగు వల్ల దోమలు విపరీతంగా పెరిగి.. రోగాల బారిన పడుతున్నామన్నారు. 15రోజుల క్రితం సర్పంచ్ ఆంజనమ్మకు, మండలాధికారులకు ఫిర్యాదు చేయడంతో వ్యర్థాలను తొలగించేరేకానీ, మురుగునీరు ముందుకు కదలలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నిలువ లేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలువలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు →





ఘనంగా కృష్ణుడి పల్లకి సేవ

ధర్మవరం, ఆగస్టు 29 : ప్రబోధా సేవాసమితి, ఇందుజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ధర్మవరంలో గురువారం శ్రీకృష్ణుడి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రబోధా సేవా సమితి సభ్యులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రబోధా సేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణ, మల్లికార్జున, నాగేంద్ర, నాగభూషణ పాల్గొన్నారు.

← స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

కూటమి నిర్ణయంపై హర్షం

బుక్కపట్నం, ఆగస్టు 29: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వమే నిర్వహించేలా నిర్ణయం తీసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి పోలేపల్లి ప్రశాంత్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం తరఫున ఆయన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

తనకల్లు, ఆగస్టు 29: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరవుతున్నట్లు నాయకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలన్నారు. యువత వనమహోత్సవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి కోరారు.

రేపే పింఛన్ల పంపిణీ

నంబులపూలకుంట, ఆగస్టు 29 : వచ్చే నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 31వ తేదీనే (శనివారం) పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ మనోహబాబు తెలిపారు. ఎన్టీఆర్ సామాజిక పింఛన్ తీసుకునే ప్రతి ఒక్కరూ గ్రామంలో అందుబాటులో ఉండాలని సూచించారు. బయట ప్రాంతాల్లో ఉన్నవారు 31న స్వగ్రామాలకు చేరుకోవాలని సూచించారు.

తనకల్లు : రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న పింఛన్లను ఈనెల 31నే పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో, 31నే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. 31న పొందలేనివారికి 2వ తేదీ సోమవారం పింఛన్లు అందిస్తారని తెలిపారు.

ఎస్ఎంసీ సమావేశం

గాండ్లపెంట, ఆగస్టు 29: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్ఎంసీ సమావేశం ఎంఇఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్కూల్ కమిటీ ఛైర్మన్లు తమ పాఠశాల, విద్యార్థుల చదువులు, మధ్యాహ్న భోజనం, ఆవరణంలో పరిశుభ్రత, విద్యార్థుల హాజరును పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

నీటి కార్మికుల జలదీక్ష

కొత్తచెరువు, ఆగస్టు 29: శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు వేతనాలు చెల్లించాలని గురువారం తమ నిరసనను కొనసాగించారు. సంఘం యూనియన్ నాయకుడు రాము ఆధ్వర్యంలో బుక్కపట్నం చెరువులో కార్మికులు జలదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.

తాడిమర్రి: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు ఇప్పించేలా చూడాలని భగవాన్ శ్రీసత్యసాయి చిత్రపటానికి సత్యసాయి నీటి సరఫరా కార్మికులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె గురువారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఓబులేసు, రాములప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక సత్యసాయి పంపు హౌస్ వద్ద గురువారం కూడా సత్యసాయి కార్మికులు సమ్మె కొనసాగించారు. చిన్నకోట్ల, గొల్లపల్లి, ముదిగుబ్బ, లక్కసముద్రం, కాళసముద్రం, కుటాగుళ్ల, నల్లమాడ సంబంధిత పంప్ హౌస్‌లో పనిచేస్తున్న కార్మికులు నల్లమాడ పంప్ హౌస్ వద్ద బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వాలేదని ఆవేదన చెందారు. కార్యక్రమంలో వెంకటేష్, శంకర్, మల్లికార్జున, గోపాల్‌నాయక్, రాజగోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీనాయక్, బాషా, నాగభూషణ, బాషా పాల్గొన్నారు.


బుక్కపట్నం చెరువులో కార్మికుల జలదీక్ష


తాడిమర్రిలో సత్యసాయిబాబా చిత్రపటానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు ←


నల్లమాడ పంపు హౌస్ వద్ద బైఠాయించిన సత్యసాయి వాటర్ కార్మికులు →

గొర్రెల కాపరి ఆత్మహత్య


శ్రీరాములు (ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 29: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కురుబ శ్రీరాములు (40) గురువారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య భారతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం భార్య, పిల్లలు ఇంట్లో లేని సమయంలో శ్రీరాములు చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన భారతి.. శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించింది. సీఐ ఇందిరా తన సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

మద్యానికి బానిసై యువకుడు..

తనకల్లు : మండలంలోని రాచినేపల్లి పంచాయతీలో ఉన్నచిన్నపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ (22) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికుమార్ మద్యానికి బానిస. మద్యం సేవించి ప్రతి రోజు ఇంటికొస్తుండడంతో తల్లిదండ్రులు మందలించేవారు. గురువారం కూడా వారు మందలించడంతో జీవితంపై విరక్తి చెంది... విష ద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా, తల్లిదండ్రులు గుర్తించి వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సాయికుమార్‌కు రెండున్నర నెలల క్రితమే వివాహమైంది. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ ధరణీ బాబు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, ఆగస్టు 29 : స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన లక్ష్మీదేవి గురువారం రాత్రి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. లక్ష్మీదేవి కుటుంబకలహాలతో తన భర్తనారాయణస్వామితో గొడవపడింది. దీంతో మనస్థాపానికి గురై ఇంటిలో ఉన్న విష ద్రావకాన్ని తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం, ఆగస్టు 29 : పట్టణంలోని మార్కెట్‌యార్డ్ వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గొట్లూరుకు చెందిన శివశంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బాలకృష్ణ గొట్లూరు గ్రామం నుంచి ద్విచక్రవాహనంలో ధర్మవరం బయలు దేరాడు. శివశంకర్ అనే వ్యక్తి తన ద్విచ్రవాహనంలో గొట్లూరు గ్రామం నుంచి ధర్మవరం పట్టణంలోకి వస్తూ బాలకృష్ణ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలకృష్ణకు స్వల్పగాయాలు కాగా.. శివశంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు శివశంకర్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పట్టపగలే చోరీ

నంబులపూలకుంట, ఆగస్టు 29 : మండలంలోని ముక్కంవారిపల్లిలో సాంబశివనాయుడు ఇంటిలో పట్టపగలే చోరీ జరిగింది. గురువారం సాంబశివనాయుడు పొలానికి నీరు కట్టడానికి వెళ్లగా, భార్య పొలం పనికి వెళ్లింది. ఇంటి తాళాలను వారు గుట్టుగా ఓ చోట ఉంచుకునేవారు. ఈ విషయాన్ని పసిగట్టిన దుండగుడు.. వారు పనులకు వెళ్లిన తర్వాత ఆ తాళం సాయంతో ఇంటిలోకి ప్రవేశించాడు. బీరువా తాళాలు పగలకొట్టి.. అందులోని రూ.17,600, రెండు జతల కమ్మలు చోరీ చేసుకొని వెళ్లిపోయాడు. సాయంత్రం విషయాన్ని గుర్తించిన ఆ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

ధర్మవరం, ఆగస్టు 29 : పట్టణంలోని శారదానగర్‌లో ఆంధ్రా మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప గురువారం తెలిపారు. అతని వద్ద నుంచి 182 మద్యంబాటిళ్లతో పాటు 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

బత్తలపల్లి : మండలంలో చిత్రవతి సమీపంలోని ఓ బంకులో అక్రమంగా మద్యం అమ్ముతున్న దంపెట్ల గ్రామానికి చెందిన వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అతని వద్ద ఉన్న 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా ముస్టురు గ్రామానికి చెందిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసి.. అతని వద్ద ఉన్న 352 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

తాడిమర్రి : మండలంలోని నారసింపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుంటిపల్లి కిశోర్(40) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మరణించాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నారసింపల్లి గ్రామానికి చేరుకుని కిశోర్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుం సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నాయకులు ఆలం నూరి, శ్రీనివాసులు ఉన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 29: సామాజిక భరోసా పింఛన్ల పంపిణీని శనివారం చేపడుతామని, లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సరస్వతి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 6787లబ్దిదారులకు గాను రూ.2,91,25,500 నగదును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

గోరంట్ల: సామాజిక భరోసా పింఛన్లను సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఈనెల 31న శనివారం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ గుప్త తెలిపారు. మండలంలోని 11,481మందికిగాను రూ.4,85,03,500 మంజూరైందన్నారు. సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం నుంచి లబ్ధిదారులకు ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఆ రోజు పింఛన్ అందుకోలేనివారికి సెప్టెంబర్ 2న అందజేస్తారని తెలిపారు.

గుడిబండ: సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. సచివాల య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు.

మడకశిర(అమరాపురం): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సెప్టెంబరు నెలకు సంబంధించిన పింఛన్‌ను శనివారమే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మండలంలోని 8619 మంది కి గాను ప్రభుత్వం రూ.3.68 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

అజ్జయ్యస్వామికి పూజలు

గుడిబండ, ఆగస్టు 29 : మండలంలోని తాళికెర గ్రామసమీపంలో వెలసిన అజ్జయ్యస్వామి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అజ్జయ్యస్వామి విగ్రహం ఎదుట బొరుగులు, మిక్చర్ నైవేద్యంగా ఉంచి పూజలు చేశారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు మొక్కలు నాటనున్న మంత్రి సవిత

పెనుకొండ, ఆగస్టు 29 : వన మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్ట నున్నట్లు పట్టణ టీడీపీ కన్వీనర్ శ్రీరాములుయాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు స్థానిక భోగసముద్రం చెరువు చేపట్టే కార్యక్ర మంలో బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖమంత్రి సవిత పాల్గొంటారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మహిళా ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

హిందూపురం అర్బన్, ఆగస్టు 29: జిల్లా సీనియర్ మహిళా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను శనివారం పట్టణ పరిధిలోని ఎంజీఎం ఆటల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్ తెలిపాడు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2009, జూలై 31వ తేదీ ముందు జన్మించిన వారై ఉండాలని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, నాలుగు పాస్ ఫొటోలు, తల్లితండ్రుల సమ్మతి పత్రంతో రావాలని తెలిపారు.

రాయితీతో ఉలవల పంపిణీ : ఏఓ

చిలమత్తూరు, ఆగస్టు 29: వర్షాభావ పరిస్థితుల్లో ఇప్పటి వరకు పంటలు సాగు చేయని రైతులకు రాయితీతో ఉలవలను అందజేస్తున్నట్లు ఏఓ వంశీకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. వీటిని 80 శాతం రాయితీ ధరతో రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామన్నారు. పదికిలోల ఉలవలు కలిగిన బ్యాగుకు రైతులు రాయితీ పోను రూ.174 ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఏ పంటలు సాగు చేయని రైతులకు మాత్రమే ఈ రాయితీ ఉలవలు ఇస్తామన్నారు.

జాబ్‌మేళాకు మంచి స్పందన

పెనుకొండ, ఆగస్టు 29: స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో కొడికొండకు చెందిన సమర్థనం దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళకు మంచి స్పందన లభించింది. సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 20కం పెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 210మంది అభ్య ర్థులు హాజరుకాగా 169మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ శ్రీధర్, ఎస్‌ఐ రాజేష్, సమర్థనం ట్రస్ట్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ప్లేస్‌మెంట్ అధికారి వీరభద్ర హాజరయ్యారు.

ఉచిత వైద్యశిబిరానికి...

చిలమత్తూరు: మండలంలోని కోడూరు తోపులో గురువారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన మార్క్ ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభిం చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి 110 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 25 మంది రోగులను శస్త్ర చికిత్సలకు, మెరుగైన వైద్యానికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామక్రిష్ణ, బీజేపీ మండల అధ్యక్షు డు హరిప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లగూర్లపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

గోరంట్ల, ఆగస్టు 29: మండలంలోని పుల్లగూర్లపల్లి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య చికిత్స శిబిరాన్ని గురువారం నిర్వహించారు. డీఎల్‌డీఏ అనంతపురం జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఉచిత గర్భకోశ చికిత్సలు జరిపి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో గర్భకోశ సమస్యలున్న 43 పశువులకు చికిత్సలు చేశారు. 12 పశువులకు నట్టల నివారణ, తొమ్మిది పశువులకు సాధారణ చికిత్సలు జరిపినట్లు తెలిపారు. గోరంట్ల పశువైద్యశాల ఏడీ శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారులు చంద్రశేఖర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

పెనుకొండ, ఆగస్టు 29 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో సరస్వతిదేవి విగ్రహప్రతిష్ఠకు భూమిపూజ చేశారు. కళాశాల ప్రాంగణంలో గురువారం ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ చంద్రశేఖర్ హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం రామక్రిష్ణ, పూర్వ విద్యార్థు లు నంజుండప్ప, కేఎన్‌మూర్తి, బాషా, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


24గంటల్లో కేసు ఛేదింపుపై ప్రశంస



సీఐ ఆంజేయులుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న

హిందూపురం, ఆగస్టు 29 : ఇటీవల మేకల కాపరి జయమ్మ హత్యకేసును 24గంటల్లో ఛేదించిన అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులును జిల్లా ఎస్పీ రత్న అభినందించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని సీఐకి అందజేశారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మే కలకాపరిని హత్యచేసి మేకలను ఎత్తుకెళ్లిన నిందితుడిని 24 గంటల్లోపే అదుపులోకి తీసుకుని మేకలను కూడా రక్షించడంపై అభినందించారు. ఎప్పుడైనా నేరం జరిగితే వెనువెంటనే దర్యాప్తు ముమ్మరం చేస్తే కేసులో పురోగతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేష్ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

లేపాక్షి, ఆగస్టు 29: మండలంలోని బిసలమానేపల్లికి చెందిన సురేష్(42) అనే వ్యక్తి బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. బిసలమానేపల్లికి చెందిన సురేష్ ఈనెల 24నుంచి కనబడుటలేదని ఆయన భార్య శారదమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గ్రామం చివరన ఉన్న బావిలో గురువారం శవమై తేలాడు. ఈనెల 24న ఇంట్లో భార్యాభర్తల మధ్య చిన్న తగాదాతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


పురంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దేశభాషలందు తెలుగు లెస్స

తెలుగు భాషా దినోత్సవంలో వక్తలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 29: దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయులు ఆనాడే కొనియాడాడని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన తెలుగుభాష దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్యోతి, తదితరులు ఉన్నారు. పట్టణంలో పలు పాఠశాలలు, కళాశాలలో తదితర చోట్ల తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బాలయేసు కళాశాలలో తెలుగులో 99 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జియావుల్లాఖాన్, గ్రంథాలయ అధ్యాపకుడు శివరామిరెడ్డి, తెలుగు అధ్యాపకుడు, కవి అశ్వత్థనారాయణ ప్రోగ్రాం అధికారి హరీష్, తెలుగు అధ్యాపకుడు భాస్కర్ తదతరులు పాల్గొన్నారు.

పెనుకొండ: గిడుగు రామ్మూర్తి పంతులు 162వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు బ్యానర్లు పట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రగతి గ్లోబు ల్ జెన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

మడకశిర డిపోకు 30 బస్సులు కేటాయించండి


రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఆగస్టు 29 : స్థానిక ఆర్టీసీ డిపో అభివృద్ధికి సహకారం అందించాలని, 30 నూతన బస్సులు కేటాయించాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో గురువారం మంత్రిని కలిసి మడకశిర నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు. 2009 వ సంవత్సరంలో మడకశిర డిపోను ఏర్పాటు చేశారని, నేటికీ ఈప్రాంత అవసరాలకు తగ్గట్టుగా బస్సులను నడపడం లేదన్నారు. తద్వారా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, రవాణా సౌలభ్యంతో పాటు డిపోకు ఆదాయం చేకూరాలంటే 30 నూతన బస్సులను మంజూరు చేయాలని కోరారు. డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరామన్నారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి జిల్లా వ్యాప్తంగా 32 తహసీల్దార్ పోస్టులకుగాను 17 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో పాలనా పరంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే అంశంలోనూ చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటిని అధిగమించాలంటే మడకశిర నియోజకవర్గంతోపాటు జిల్లాలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతపురం పలు సమస్యలపై చర్చించామన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

హిందూపురం(పరిగి), ఆగస్టు 29 : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ సూచించారు. మండల పరిధిలోని సేవమందిరంలో నూతనంగా ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు చంద్ర అధ్యక్షతన గురువారం రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ హాజర య్యారు. పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, భైరెడ్డి, వెంకటరెడ్డి, సంగారెడ్డి, సంజీవమూర్తి, వేదవ్యాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎనుముల రామక్రిష్ణ పేర్కొన్నారు. పెనుకొండలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త అక్టోబరు 1 నుంచి 25వరకు 200 చొప్పున సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగడి రామాంజినేయులు, అసెంబ్లీ కోకన్వీనర్ రవి, హనుమంతుయాదవ్, ముత్యాలమ్మ, హరి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రొద్దం మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుగంటి వేణుగోపాల్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ రవి, పవన్, రాజు, మహదేవ, నాగప్ప, ఆదిమూర్తి, రామప్ప, తిప్పేస్వామి, తిమ్మయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ ఏపీపై అధికారుల సమీక్ష

గోరంట్ల, ఆగస్టు 29: వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2024 కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. పెనుకొండ నోడల్ అధికారి, హెచ్ఎన్ఎస్ఎస్ డీఈఈ రేణుకాదేవి ఆధ్వ ర్యంలో జరిగిన ఈ సమావేశంలో 11 శాఖల ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు. 2024-25నుంచి ఐదేళ్లపాటు నిర్వహించే కార్యక్రమంలో యాక్షన్ ప్లాన్‌గురించి చర్చించారు. ఉన్న వనరులతోపాటు ప్రతియేటా ఆయా శాఖల్లో 15శాతం వృద్ధిరేటు పెరిగేలా అభివృద్ధి ప్రణాళికలు, ఇందుకోసం ప్రభుత్వంనుంచి అవసరమైన ఆర్థిక వనరుల గురించి చర్చిం చారు. తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఎంఈఓ జాన్‌రెడ్డి, ఏఓ మునిక్రిష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

సీడీపీఓ ఆధ్వర్యంలో క్లస్టర్ సమావేశం

మడకశిర(అమరాపురం), ఆగస్టు 29: మండల కేంద్రంలోని స్థానిక ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో క్లస్టర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ గత నెలలో అంగన్‌వాడీలకు ఎంత సరుకు వచ్చింది? ఎంతవరకు లబ్ధిదారులకు పంపిణీ చేశారు? ఎంత మిగిలి ఉందని ఆమె అడిగి తెలుసుకొన్నారు. పాలు, గుడ్లు, కందులు, నూనె, బెల్లం, రాగిపిండి వంటి వాటిని బాలింతలు, గర్భిణులకు సక్రమంగా అందించాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విధులపట్ల జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆమె కోరారు. గతనెలలో వచ్చిన సరుకుల రిజిస్టార్‌ను పరిశీలించారు.

క్షణికావేశంతో జీవితాలు నాశనం

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీధర్

హిందూపురం, ఆగస్టు 29 : జైలులో శిక్ష అనుభవిస్తున్నవారు క్షణికావేశంలో చేసిన నేరాలకు ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్ అన్నారు. న్యాయాధికారి గురువారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలను వారి నేరాలు, జైలుశిక్ష గురించి అడిగి తెలుసుకున్నారు. జైలు నుంచి బయటికి వెళ్లాక సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే తమ దృష్టికి తీసుకొస్తే ఉచిత న్యాయసహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి అంజినాయక్, న్యాయవాదులు సంతోష్‌కుమార్, రత్నకుమార్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి పైప్‌లైన్ పనులు


తాగునీటి పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

పెనుకొండ టౌన్, ఆగస్టు 29: బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చొరవతో తాగునీటి పైప్‌లైన్ పనులు శరవేగంగా చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పైప్‌లైన్ పనులు నిలిచిపోవడంతో పలు కాలనీల ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే తక్షణం తాగునీటి సమస్యపై మంత్రి సవిత దృష్టి పెట్టారు. ఈ క్రమంలో స్థానిక షీప్‌ఫారం నుంచి పెనుకొండలోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు తాగునీటి పైప్‌లైన్ పనులు శరవేగంగా చేపడుతున్నారు. దీంతో పెనుకొండలోని ఆల్విన్‌కాలనీ, వజ్రాలపేట, జీవీసీ కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీటి సమస్య మరో వారంలో తీరనుంది.

బడి వేళకు బస్సులు నడపండి: టీఎన్ఎస్ఎఫ్


వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

మడకశిర రూరల్/టౌన్, ఆగస్టు 29 : గ్రామీణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును సక్రమంగా నడపాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు, విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో అధికారులను కలిసి వినతి పత్రాన్ని అంజేశారు. ఈ సంద ర్భగా వారు మాట్లాడుతూ... మండ లంలో గౌడనహళ్లి, తురుకువాండ్లపల్లి, జమ్మానిపల్లి, చందకచర్ల గ్రామాల విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు నడుస్తోందన్నారు. బస్సు సకాలంలో రావడంలేదన్నారు. దీంతో పట్టణంలోని ఉన్నత పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు బస్సు గ్రామాలకు రావల్సిఉండగా ఉ.8.50కి వస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు, కళాశాలకు వెళ్లలేకపోతున్నారని వారు వాపోయారు. బస్సును వేళకు నడిపేందుకు తగుచర్యలు తీసుకోవాలని వారు డిపో అధికారులను కోరారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి


అడవి పందుల దాడిలో నాశనమైన పంట

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 29 : మండల పరిధిలోని పత్తికుంటపల్లిలో ఉప్పర తిప్పన్న అనే రైతుకు చెందిన పాప్‌కార్న్ మొక్కజొన్న పంటపై బుధవారం అర్ధరాత్రి అడవి పందు లు దాడిచేశాయి. దీంతో రూ.లక్ష పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ఉప్పర పోతన్నకు గ్రామంలో రెండెకరాల పొలం ఉంది. బోరుకింద మొక్కజొన్న సాగుచేశాడు. దీనికోసం బాగేపల్లి నుంచి పాప్‌కార్న్ మొక్కజొన్న విత్తనాలు 8కేజీలను రూ.4వేలు వెచ్చించి తీసుకొచ్చి విత్తుకున్నాడు. పంటకాలం మూడు నెలలుకాగా అడవి పందుల బెడద ఎక్కువ కావడంతో రేయింబవళ్లు కాపలా ఉంటూ పంటను కాపాడుకుంటూ వచ్చాడు. ప్రస్తుతం పంట కాత దశలో ఉంది. ఈ సమయంలో అడవి పందుల గుంపు పంటపై దాడి చేయడంతో తీవ్రంగా నష్టపోయానని రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టానని, పంట చేతికొచ్చి ఉంటే పెట్టుబడిపోను రూ.2లక్షలు వచ్చి ఉండేదని వాపోయాడు. మార్కెట్‌లో పాప్‌కార్న్ క్వింటాల్ ధర రూ.12వేలు పలుకుతోందని ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

పలు విద్యాసంస్థల్లో...


గుట్టూరులో ఓ సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు


వెంకటరెడ్డిపల్లిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఆగస్టు 29: మండలంలోని గుట్టూరు వెంకటరెడ్డిపల్లి, మావటూరు, తదితర ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో సాంస్కృతి కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

గోరంట్ల: మసకబారిపోతున్న తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎస్‌పీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం తెలిపారు. గోరంట్లలోని ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాల, ఎస్‌పీఎం డిగ్రీకళాశాల సంయుక్తగా తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓలు ఆజాద్, రఘునాథ్‌రెడ్డి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం(పరిగి), ఆగస్టు 29: తెలుగుభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం పరిగి జడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం కృపాసత్యరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీమాంత్రికుడు ధ్యాన్‌చంద్ సేవలను వివరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.


బహుమతితో ఛాయాదేవి

మడకశిర (అమరాపురం) : మండలంలోని వీ అగ్రహారం జడ్పీ ఉన్న త పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా పద్యపఠన పోటీలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఛాయాదేవి 50 పద్యాలు చెప్పి తన ప్రతిభను చాటింది. ఆమెను తె లుగుభాషా ఉపాధ్యాయుడు కరిబడప్ప రూ.500 ఇచ్చి అభినందించారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలచిన విద్యార్థులకు బహుమతులిచ్చారు.

మడకశిర రూరల్ : తెలుగుబాషా దినోత్సవాన్ని, క్రీడా దినోత్సవాన్ని మండలంలోని పాఠశాలు, కళాశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జిల్లేడగుంట పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు భూతన్న గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రాపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు కరియన్నను సన్మానించారు. వెంకటేశ్వర కళాశాలలో కూడా ఘనంగా నిర్వహించారు.

అగళి: స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ జాఫర్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మండల వ్యాప్తంగా పాఠశాలల్లో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

రొళ్ల: మండలంలోని గురుకుల పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

జడ్పీటీసీ ఉమేష్

అగళి, ఆగస్టు 29 : పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జడ్పీటీసీ ఉమేష్ సూచించారు. ఆయన గురువారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో డ్రైనేజీలను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించారు. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి, గడి తదితర పిచ్చి మొక్కలు పెరిగి మురుగునీరు ముందుకు సాగడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీన్ని గమనించిన జడ్పీటీసీ వెంటనే స్పందించి ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించిన మేరకు గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు, ఇళ్ల పరిసరాల్లో అపరిశుభ్రత ఉండకుండా చేసేందుకు రెండు రోజులపాటు చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆయన ఆదేశించారు. వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలన్నారు. గ్రామాల్లో కలుషిత నీటి వల్ల దోమలు అధికమై మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని సూచించారు. జడ్పీటీసీ వెంట టీడీపీ నాయకులు కమ్మరి శివన్న, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల సొమ్ము రికవరీ చేయండి

ఏసీ, ఏపీఎంకు వినతి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 29: మండల పరిధిలోని పత్తికుంటపల్లిలో మహిళా సంఘాలకు సంబంధించిన సొమ్మును యానిమేటర్ తమ స్వార్థ ప్రయోజనాల కోసం పక్కదోవ పట్టించారని మహిళా సంఘాల సభ్యులు ఏసీ రామిరెడ్డి, ఏపీఎం రామాంజినేయులుకు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో 24మహిళా సంఘాలున్నాయని ఇందులో స్వాతిసంఘం, మహాలక్ష్మీ సంఘం, అంబికా, వినాయక సంఘాల సభ్యులకు సంబంధించి సుమారు రూ.5.38లక్షలు అవకతవకలు జరిగాయన్నారు. అలాగే లక్ష్మీనరసింహ, ఆంజనేయస్వామి తదితర సంఘాల్లో కూడా అవకతవకలు జరిగాయన్నారు. యానిమేటర్‌తో పాటు ఇందులో ప్రమేయం ఉన్న మరికొందరిని విచారించి పక్కదారి పట్టిన సొమ్మును రికవరీ చేయాలని కోరారు. సోమవారంలోగా తమకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని సంఘాలసభ్యులు నంజమ్మ, అరుణమ్మ, లలితమ్మ, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీదేవి, డిమాండ్ చేశారు.

'టీడీపీ వెంటే నాయిబ్రాహ్మణులు'


సీఎం, ఎమ్మెల్యే ఫొటోలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

హిందూపురం, ఆగస్టు 29: టీడీపీ ఆవిర్భావం నుంచి నాయీబ్రాహ్మణులు ఆ పార్టీ వెంటే నడుస్తున్నారని నాయీబ్రాహ్మణ సంఘం హిందూపురం నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు నెలకు రూ.25వేలు వేతనం పెంచుతూ ఆలయ కమిటీలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణచిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు మంజునాథ్, రఘు, నాయకులు అశోక్, దివాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘననివాళి

పావగడ, ఆగస్టు 29 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1947ఆగస్టు 29 లో రాజ్యాంగ రచనసమితి అధ్యక్షునిగా ఎన్నికైన రోజును పురస్కరించుకుని పావగడలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘం నాయకుడు నారాయణప్ప, బౌద్ధ సంఘం అధ్యక్షుడు సుబ్బరాజు, టీఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.